# ఏదండి ముందుకి

గుడిలో పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది. మిత్రులకు, శ్రేయోభిలాషులకు రిసెప్షన్-హోటల్లో ఏర్పాటుచేశాడు జనార్దనరావు.

ఆదర్శ వివాహం కావడంచేత వచ్చినవారిలో కుతూహలంపాలు కొంచెం ఎక్కువగానే వుంది. అసలు మామూలుగానే అందరి దృష్టినీ ఆకర్షించేది పెళ్ళికూతురు. అయితే, ఇందులో మరికొంచెం కుతూహలం కలిగించే విషయం పెళ్ళికొడుకుతోబాటు పెళ్ళికూతురుకీ ద్వితీయ వివాహం కావడం!!

అందరి చూపులూ తనమీదనే వున్నాయన్న విషయం తెలుసు కళ్యాణికి. సుమారు అయిదేళ్ళక్రితం తనెదుర్కొన్న ఇదే సన్నివేశానికి వెళ్ళింది మనసు — అమాయకంగా వేలు పుచ్చుకుని నిలబడిందానాడు. ఈనాడు ఆ అమాయకత్వం వుందా? అది చూసేందుకే వీళ్ళందరి కుతూహలం!... చిన్న చిరునవ్వు మెరవబోయింది పెదిమలమీద. గబుక్కున ఆ ఆలోచనని మనసులోంచి తొలగించేసింది కళ్యాణి.

ప్లేటులో ఐస్‌క్రీం చూడగానే పిల్లలు గుర్తుకువచ్చారు కళ్యాణికి. 'ఏం చేస్తున్నారో ఏమిటో' అనుకుంది.

"ఇప్పుడు మనం జనార్దనరావుని అభినందించాలి. అందరూ ఆదర్శాలు గురించి మాట్లాడేవారేగాని ఆచరించేవారు కనబడరు. ఆదర్శాలన్నవి ఇతరులకు చెప్పేటందుకే కథండి" అందరూ చప్పట్లు కొట్టారు. కళ్యాణి కూడా చప్పట్లు కొట్టడం చూసి జనార్దనరావు మెల్లిగా ఆమె చెయిమీద చెయి వేశాడు— "మనల్ని గురించే మాట్లాడుతున్నప్పుడు..." అంటూ.

కళ్యాణి గభాలున మనసుని కట్టేసుకుంది. ఐస్‌క్రీం, దానిమీంచి పిల్లల ఆలోచన రావడంతో తను పరధ్యానంలోకి పోయింది.

ఆయన అయిపోయి మరొకరు మాట్లాడుతున్నారు "మనం సతీసహగమనం రోజుల నుంచి ప్రయాణం చేసుకుంటూ వస్తున్నాము. ఎంతదూరం, ఎంతకాలం వచ్చేశాము. కన్యాశుల్కాలు దాటాం. ఇప్పుడు వరకట్నాలలో వున్నామనుకోండి. అదొకవైపు. మరొకవైపు ఎనిమిది సంవత్సరాలకే పెళ్ళిళ్ళ రోజులు దాటాం. చిన్న వయస్సులోనే విధవ అయితే గుండుకొట్టించి ఇళ్ళలో చాకిరీకి వాడుకునే రోజులు పోయాయి. ఆడవారు పురోగమిస్తున్నారు. అందుకు వీళ్ళకు మగవారి సహాయం కావాలి. విధవన్ని వివాహం చేసుకునే వారుంటే గదా ఆమె చేసుకునేది!

కనుక, అన్నివిధాలా అర్హతలు కలిగి వుండి, యువకులయి వుండి కళ్యాణిగారిని చేసుకుంటున్న జనార్దనరావుగారిది ఆదర్శం. ఇప్పటికింతగా పురోగమించిన వాళ్లం— ఇంకా ఎంతో ముందుకు వెళ్ళవలసిన పరిస్థితి వుంది. చూద్దాం! ఒక్కసారే మొత్తం నమిలి మింగలేం కదా! తిన్నది అరుగుతూ వుండాలి. ఇంకో అడుగు ముందుకు మరికొంత కాలం పట్టవచ్చు" కూర్చున్నాడాయన.

మళ్ళీ చప్పట్లు కొట్టారు. ఈ సారి కళ్యాణి జాగ్రత్త పడింది.

ఇంటిముందు కారులోంచి దిగింది. జనార్దనరావు కూడా దిగి "కమాన్, మనకిప్పుడు హారతులు అదేమీ వుండదు. తెలుసుగా!" అని నవ్వి ఆమె చేయిపుచ్చుకుని ఇంటిలోకి తీసుకువెళ్ళాడు. ఎదురుగా కనబడిన పనమ్మాయితో "పిల్లలేరి లక్ష్మీ" అన్నాడు.

"వాళ్ళ పిన్నిగారు వచ్చి తీసుకుపోయారయ్యగారు" అంది కళ్యాణి వంకనే చూస్తూ.

"అదేమిటి, వాళ్ళని పెట్టుకుని నిన్నిక్కడే వుండమన్నాను కద !"

"ఇటువంటప్పుడు వాళ్ళు ఎందుకు? రేపు ఉదయం తీసుకువస్తాను అన్నారండి అమ్మాయిగారు" అంది.

"ఓహ్. కరెక్టే! సో, కళ్యాణీ నువ్వు పిల్లల్ని కలిసే ముహూర్తం రేపటికి వాయిదాపడిందన్నమాట" అన్నాడు కళ్యాణితో.

కళ్యాణి నిరుత్సాహపడింది. పిల్లలంటే ఆమె కెప్పుడూ ఇష్టమే! వారెవరయినా సరే. అటువంటిది తన పిల్లల్లాగా చూసుకోవలసిన ఈ పిల్లలు ఎలా వుంటారా, తనతో ఎలా మాట్లాడతారా అని కొంచెం ఆందోళన కలిగి వుంది. అది కాస్తా వాయిదాపడడం......

"అలా నిరుత్సాహపడకు కళ్యాణి. ఒక్క రోజులో ఏమయింది? కనీసం నీ రక్షణలో వాళ్ళంతా పదిహేనేళ్ళయినా వుండాలి. నిజానికి ఈ రోజు మనల్ని మన మానాన వదిలేయడం మంచిపనే చేసింది. కమాన్" అంటూనే మేడపైకి తీసుకువెళ్ళాడు.

బాగానే ఆస్తిపరుడని వింది కాని ఇంత ఎక్కువగా 'ఉన్న' వాడని అనుకోలేదు కళ్యాణి. "ఇది మన బెడ్ రూం. ఈ పూటకి కారియర్ వస్తుంది, అది తిందాం. మనంతట మనమే అగరొత్తులు వెలిగించుకుని గదిలోకి వెళ్ళిపోవడం— నో ఫార్మాలిటీస్ యునో! ఐమీన్-తతంగం ఏమీ వుండకుండా నన్నమాట."

తల వంచుకుంది. నిజానికి అమ్మాయికి సిగ్గువేసింది, జీవితంలో రెండవసారి జరగబోతున్న ఆ అనుభవాన్ని తలచుకుంటే! కాని సిగ్గు బయటకు కనబడితే అది సహజంగా కనబడకపోవచ్చు అతనికి అనిపించింది ఆమెకు. అతను చాలా మామూలు ధోరణిలో మాట్లాడటం చూసి 'ఎంత యినా మగవాడు మగవాడే' అనుకుంది.

ఒక రాత్రివేళ మెలకువవచ్చింది కళ్యాణికి. కాసేపు

## సింగరాజు రామచంద్ర మూర్తి

తనెక్కడుందో ఆమెకే తెలియ లేదు. రెండు చేతులతో అలా తడుముకుంది. వుండవలసిన పిల్లలు లేరు. ఒక చేతికి ఏవీ తగలలేదు. రెండవ చేతికి మగస్పర్శ— ఆ స్పర్శని ధృవ పరుస్తూ తనమీద భర్తచేయి!

"పిల్లల్ని నీ దగ్గర పడుకోబెట్టుకోకమ్మడూ, రేపు నువ్వు వెళ్ళిపోయినాక వాళ్ళకీ, నాకూ, నీకూ కూడా వచ్చే ఇబ్బంది. నువ్వు ఇక్కడుండగానే వాళ్ళని నా దగ్గర పడుకోబెట్టడం అలవాటు చేయి" అని తల్లి అంటే తను వినలేదు. "ఇంకా వాళ్ళు, నేను కలిసి పడుకునేది కాసిని రోజులేనమ్మా. తరువాత మెల్లగా నాతో బంధం తగ్గిపోతుంది వాళ్ళకి. మరిచిపోతారేమో కూడా!" తన కంఠం రుద్ధమయిపోయింది ఆ ఏవరి మాట అంటుంటే.

నిజమే మరి. ఆ భయంకరమయిన దురదృష్టాన్ని తను వాళ్ళ సాన్నిహిత్యంలోనే మరువగలిగింది. అప్పటి నుంచి ముగ్గురూ విడిపడకుండా వున్నారు. ఒక్క క్షణం కూడా వాళ్ళు తనని విడవకుండా ఇద్దరూ రెండు వైపులా వుండే వారు.

తనిప్పుడు వాళ్ళని వదిలి వచ్చేసింది. కళ్ళనీళ్ళు తిరిగాయి. వాళ్ళని చూడాలన్న కోర్కె బలం అయిపోయింది. మెల్లగా అతని చేయి తీసి లేచి నిలబడింది. బల్లమీద లెటర్ పాడ్, పెన్ను కనబడ్డాయి.

కూర్చుని "చిరంజీవి పద్మ, పవన్‌లకు" అని రాసింది. వెంటనే— "ఉత్తరాలు వ్రాయకు తల్లి. ముఖ్యంగా వాళ్ళకి రాయకు. అనవసరంగా వాళ్ళని ఇబ్బందిపెట్టకు. ఎదిగే వయసులు వాళ్ళవి. చప్పున ఏదయినా మరచిపోగలరు" అన్న తల్లి మాటలు గుర్తుకొచ్చాయి కళ్యాణికి.

అలాగే కూర్చుండిపోయింది రాయకుండా...

"అసలెందుకు చేసుకోవాలి ఈ పెళ్ళి నేను, నా పిల్లలకి దూరమయే కాడికి?" ఎదురుప్రశ్న వేసింది తల్లిని తనా నాడు.



"చెబుతా విను. నా వయసెంత? నలభయి అయిదు. నాన్న గారికి ఇంకా అయిదారేళ్ళు ఉద్యోగం వుంది. అదయినాక పెన్షన్ వస్తుంది. నాకు ఒంట్లో ఓపిక మరొక పదిహేనేళ్ళు వుంటుంది. నీ వయసెంత? ఇరవయి నాలుగు. ఇంకా ఎంత జీవితం గడపాలి? షుమారు ఇరవయి ఏళ్ళ సంసారిక జీవితం గడపాలి. అందులో అతి ముఖ్యమయిన భాగం పదిహేనేళ్ళు. నువ్వు అందమయిన దానివి. బాగా అందమయిన దానివి కూడా!"

ఆ మాటకి తను అడ్డుకుని "నీ పోలికే ముమ్మూర్తులా" అంది.

ఆవిడ నవ్వి "అవును. కాని అందం ఒకప్పుడు అండగా వుంటే, ఒకప్పుడు శత్రువు అవుతుంది. నీ పిల్లలని పెంచడం కష్టంకాదు నాన్నగారికి, నాకు. మంచి కాలక్షేపం కూడా. ఇప్పుడు నీ కూతురికి మూడు, పిల్లాడికి రెండు సంవత్సరాలు. మరో పదిహేనేళ్ళల్లో పద్మ పెళ్ళీడుకి వస్తుంది. ఆ తరువాత పవన్‌కి చదువయిపోతుంది.


ఆడపిల్లకి పెళ్ళయినాక దాని సంసారం, దాని భర్త, పిల్లలే కాని తల్లిని పట్టించుకునే అవకాశం వుండదు. నీ కూతురూ అంతే!

"ఇక నీ విషయం తీసుకో. మమ్మల్ని నమ్ముకోవాలి. మా తరువాత అన్నయ్యని నమ్ముకోవాలి. రాబోయే పది, పది హేనేళ్ళు ఏ మాటా పడకుండా గడపడం ఎంత కష్టం అంటావు. నువ్వు ఎంత జాగ్రత్తగా వున్నా చుట్టూ వున్న జనం నిన్ను వుండనిస్తారా? నీది ఒంటరిగా వుండే వయసు కాదు కదా! అన్నయ్య ఇల్లు నీ ఇల్లెలా అవుతుంది?

అసలు మొదటిసారి పెళ్ళి కావడమే కష్టంగా వున్న ఈ రోజులలో రెండవ పెళ్ళి దానివి నిన్ను చేసుకునేందుకు ఇష్ట పడుతున్నాడతను. అందులోనూ పిల్లలున్న దానివి. ఎంత విశాల హృదయం అయుండాలి నీకీ అవకాశం ఇచ్చేందుకు? కాకపోతే, నీ పిల్లల్ని నీతో రానీయకూడదన్నాడు. నిన్ను ఒంటరిగానే రమ్మన్నాడు. అది తప్పా? పరాయి మగాడికి పుట్టిన పిల్లల్ని ఏ భర్త భరించగలడు?

"నా మాట విను తల్లీ. రోజులు ఎలాగయినా గడుస్తాయి. పొట్టకింత దొరకకపోదు. అయితే నువ్వు రాణీలాగా మళ్ళీ భర్త దగ్గర గడుపుతుండడం అదెంత నిండు! ఇంత చిన్న వయసులో మోడులాగా బతుకుతుంటే మేం చూస్తూ కళ్ళనీళ్ళు పెట్టుకోవడం— ఏది, మంచిది?

"అవకాశం జారవిడవకు. ఈ రోజు సానుభూతులు, దయలు రేపుండవు. నీ పిల్లల్ని కళ్ళల్లో పెట్టుకుని చూస్తాను. నువ్వు సలక్షణంగా పెళ్ళిచేసుకుని కాపరానికి వెళ్ళు తల్లీ! పైగా ఇంకోమాట విను. శారీరకమయిన కోర్కెలు అన్నవి మన వెంట వుంటూనే వుంటాయి. ప్రస్తుతం దుఃఖంలో అవి మరుగునపడినా మళ్ళీ బయటపడక మానవు."




మాట్లాడలేదు తను. మాట్లాడలేదు కూడా...!

లెటర్ పాడ్ మీది కాగితం చింపి వుండచేసి కిటికీలోంచి అవతల పారేసింది. భర్తవైపు చూసింది. అలాగే పడుకుని వున్నాడు. అప్పుడు అతని మీద జాలివేసింది. ముందే తన పరిస్థితి చెప్పి, తనకెలా వుండాలో చెప్పి మరీ చేసుకున్నాడు ఈ పెళ్ళి! కనుక తన కర్తవ్యం – దీపం ఆర్పేసి లేచివెళ్ళి అతని పక్కన పడుకుంది. కింద వున్న అతని చేయి తీసి తనమీద వేసుకుంది.

"నిద్ర పట్టడం లేదా?" అడిగాడు జనార్దనరావు.

"ఊఁ!" అని కళ్ళు మూసుకుంది.

మర్నాడు ఉదయమే చెప్పాడు జనార్దనరావు "నాకు ఇద్దరు పిల్లలని నీకు తెలుసు కదా, వాళ్ళపేర్లు సతీష్, శిరీష. ఆరు, ఎనిమిది సంవత్సరాలు వరుసక్రమంలో" అని నవ్వి, "మా మరదలు తీసుకువెళ్ళింది వాళ్ళని. వాళ్ళక్కయ్య పోయినప్పటినుంచి తనే చూస్తోంది వాళ్ళని. కాని ఆ అమ్మాయికీ భర్త, సంసారం వుంది కదా. ఎన్నాళ్ళని చూడగలదు? పైగా నా వయసూ ఒంటరిగా వుండేంత కాదు కదా! అందుకని మన పెళ్ళి వగయిరా. ఇప్పుడు నేను ఆఫీసుకి వెళ్ళాక వాళ్ళని తీసుకొచ్చి దింపమని ఫోను చేస్తాను. రాకపోయినా ఆశ్చర్య పడకు. ఇంకా చాలా ఏళ్ళు నీ రక్షణ వాళ్ళకవసరం. ఒక్క రోజులో పోయేదేమీ లేదు" అని.

అయితే అతను ఆఫీసుకి వెళ్ళాడు, తిరిగీ వచ్చాడు గాని పిల్లలు మాత్రం రాలేదు. "పిల్లల్నావిడ తీసుకురాలేదు" అంది కళ్యాణి అతను వస్తూనే.

నవ్వేశాడు జనార్దనరావు. "ఇంతే కదా. పద, మనం సినిమాకి వెడదాం. రేపు మళ్ళీ కేంపు నాకు. నీక్కొంచెం కాలక్షేపం చేయించాలి కదా— కొత్త వాతావరణమాయె!"

తరువాతి రోజు జనార్దనరావు ఆఫీసుకు వెళ్ళిపోయాక పిల్లల్ని తీసుకువచ్చింది అతని మరదలు. వస్తూనే "

With the best compliments from

Phones: 20636 Shop, 20013 Resi.

Bhavani Dresses

Exclusive Readymade garments for Children

With the best compliments from

Phones:- Resi: 20013 Shop: 24825

in Style (A.C.)

The Fashion Shoppe for Men & Children

Arundalpet, Main Road

GUNTUR - 2 (A.P.)

గ్రహించే వుంటారు. వీళ్ళిద్దరూ మా అక్కయ్య పిల్లలు" అంది. క్షణం ఆగి "ఇక మీ పిల్లలు" అంది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

కళ్యాణి పిల్లల వంక చూస్తోంది. వాళ్ళిద్దరూ వాళ్ళ పిన్నిని రెండు పక్కలా పట్టుకుని తనవంకనే చూస్తుండడం గమనించి "రామ్మా గిరీష, నాన్నగారు కాంపుకి వెళ్ళారు" అని నవ్వుతూ "అన్నట్టు మీరు 'నాన్నా' అంటారా, 'నాన్నగారు' అంటారా?" అంది కళ్యాణి.

"'డాడీ' అంటాం" అన్నాడు కుర్రాడు.

నవ్వేసింది కళ్యాణి. "ఓహ్! కాన్వెంటుకి వెడుతున్నారు కదూ మరచిపోయాను. మీ డాడీ మీకోసం ఏం తెచ్చారో చూడరూ మరి" అంది.


వాడు వాళ్ళక్క వంక చూశాడు.

రాజ్యం "మీరిద్దరూ మీ గదిలోకి వెళ్ళి వుండండి. ఆంటీతో మాట్లాడి వస్తాను" అంది.

ఆ సంబోధనకి కొంచెం కష్టం వేసింది కళ్యాణికి. అయినా మాట్లాడలేదు. వాళ్ళు బెదురుగా కళ్యాణి వంక చూస్తూనే పైకి వెళ్ళిపోయారు.

"నా పేరు రాజ్యలక్ష్మి, మా అక్క పేరు జయలక్ష్మి. నాకు మా అక్క అంటే చాలా ఇష్టం, ప్రేమ. దానికీ అంతే. ఇంత హఠాత్తుగా అది పోతుందనుకోలేదు నేను" అని తల వంచుకుని "పోతుందని ఏమాత్రం అనుమానం వున్నా నేనసలు పెళ్ళి చేసుకోకుండా ఆగి ఇప్పుడు మా బావనే చేసుకునేదాన్ని పిల్లలకోసం" అంది.

కళ్యాణి ఏమీ మాట్లాడలేదు.




కాసేపాగి మళ్ళీ రాజ్యమే అంది "మా అక్కకి వీళ్ళిద్దరూ అంటే విపరీతమయిన ప్రేమ. మా బావకి మా అక్కన్నా, పిల్లలన్నా చాలా ఇష్టం. పిల్లలున్న మిమ్మల్ని చేసుకోవడంలో ఉద్దేశం కూడా అదే! తల్లి ప్రేమ అంటే ఎరుగున్నవారు కదా. తన పిల్లల్ని బాగా చూస్తారని. క్షణం క్షణం మీ పిల్లలు మీకు

గుర్తుకి రావడంవల్ల వీళ్ళని ఏమయినా కోప్పడాలన్నా కోప్పడలేరు. వీళ్ళు కళ్ళనీళ్ళు పెట్టుకుంటే మీకు మీ పిల్లలు గుర్తుకు వస్తారని!

"మా బావలాంటి దేవుడు దొరకడం మీ అదృష్టం. ఆదర్శాలు అమలుజరిపే మనిషి భర్త కావడం ఎంతటి వాళ్ళకి! మీరేమీ అనుకోకపోతే ఒక్క కోరిక."

"చెప్పండి" అంది కళ్యాణి.

"మీరున్న ఈ ఇంటి వాతావరణానికి పిల్లలు అలవాటు పడేదాకా నేను, వాళ్ళు అటు ఇటు తిరుగుతుంటాం. మీరేమీ అనుకోకూడదు."

కాసేపు తటపటాయించి "అలాగే!" అంది కళ్యాణి.

రాజ్యం ముఖంలోకి వెలుగొచ్చింది. "సతీష్, శిరీష" అని పెద్దగా కేకేసి వాళ్ళు రాగానే "ఆంటీ ఒప్పుకుంది. పదండి పోదాం. మళ్ళీ వస్తామండి కళ్యాణిగారు" అంటూనే లేచి నిలబడింది.

"కాసేపుండరూ?" అంది కళ్యాణి శిరీషతో

"మళ్ళీ వస్తాం" అంది ఆ పిల్ల మెల్లిగా, పిన్ని చీర పుచ్చుకుని నలుపుతూ.

"సిగ్గు బాగానే వుంది కాని, చీర పాడుచేయకు. పదండి పోదాం" అంటూనే ముగ్గురూ బయటకి వెళ్ళిపోయారు.

తాను వచ్చిన పదిహేను ఇరవయి రోజులకు కూడా పిల్లలు ఇంట్లో వుండకపోవడం కళ్యాణి మనసుకి కష్టమనిపించింది. అదేమాట జనార్దనరావుతో కూడా అనేసిం దొకరోజు. దానికి "పోనీలే కళ్యాణి, వాళ్ళ పిన్నికి మోహం మొత్తనీ. లేదూ పెంచుకుంటుంది పెంచుకోనీ ఇష్టమైతే. సరాసాగా


CHOOSE YOUR FAVOURITE T.V FROM FLORA




BUSH

NELCO

SONY — ORSON

Solidaire

Available at easy instalments

FOR BEST & PROMPT SERVICE AFTER SALES

Flora

NEAR SAILAJA THEATRE
GANDHINAGAR VIJAYAWADA-3

వున్నారు కదా!'' అన్నాడు.

''అదేమిటండి మరి నన్ను చేసుకుందెందుకు మీరు?''

''నాకోసం కూడా. ఆ విధి నిర్వర్తిస్తున్నావు కదా'' అనే శాడు.

అయితే అదే సాయంత్రం పిల్లలిద్దరినీ తీసుకుని రాజ్యం వాళ్ళ పనిమనిషి వచ్చింది. ''అబ్బాయిగారికి జ్వరంట. అక్కడ రాజమ్మగారి క్కూడా జ్వరమేనట. అందుకని అయ్యగారు పిల్లల్ని దింపి రమ్మన్నారు'' అని చెప్పి వెళ్ళి పోయింది.

''మీ పిన్నికి జ్వరమయితే తను కూడా రాకపోయింది శిరీషా!'' అంది కళ్యాణి.

''మా పిన్నికి జ్వరం ఏమీలేందే! తమ్ముడికి రెండు రోజుల నుంచీ జ్వరం. ఇవాళ ఒళ్ళంతా చూడు ఎలా ఎర్ర ఎర్రగా పొక్కులు వచ్చేశాయో! వాళ్ళ పనిమనిషి అది ఆట్లమ్మ అంది. నాకూ జ్వరం ఈ రోజు. నాకూ అదేనంది వాళ్ళ పనిమనిషి. అందుకు వచ్చేశాం ఆంటీ'' అంది ఆ పిల్ల.

సాయంత్రం జనార్దనరావు వచ్చేసరిగి డబుల్ కాట్ మీద పిల్లల్నిద్దరినీ చెరొకవైపు వేసుకుని పడుకుని వున్న కళ్యాణి అగపడిందతనికి!

''అదేమిటి, వీళ్ళెప్పుడు వచ్చేశారు? ఇక్కడ ఈ పడక లేమిటి? వాటీజ్ దిస్ కళ్యాణి'' అన్నాడు.

''సతీష్‌కి ఆట్లమ్మ — అంటే అమ్మవారు — శిరీష క్కూడా అదేనని అనుమానం. ఒళ్ళు జ్వరంతో పేలి పోతోందిద్దరికీ!'' అంది.

''నాకు కాఫీ...'' అని ఆగిపోయాడతను.

పిల్లలిద్దరూ ఆమె మీద చేతులు వేసుకుని పడుకుని వుండడం చూసి ''నో, నో అలా అంటుకోకూడదు కళ్యాణీ, ఇది అంటువ్యాధి. ఎవరినయినా మనిషిని పెడదాం, నువ్వు లే ముందు'' అన్నాడు.

''మీరు అవతలికి వెళ్ళండి. తల్లికీ, పిల్లలకి మధ్య ఎవరూ వుండకూడదు. ఫ్లాస్కులో కాఫీ పోశాను తాగండి'' అంది.

అతను ఒక్కసారి ఆమె వంక చూసి వంటింటిలోకి వెళ్ళి పోయాడు. '''తల్లి' అంటావేమిటి ఆంటీ, నువ్వు మాకు 'ఆంటీ'వి కదా!'' అన్నాడు సతీష్.

''ఎవరన్నారు?''

''మా రాజ్యం ఆంటీ.''

''సరే! నేను కొన్ని ప్రశ్నలు వేస్తాను. తెలివిగలవాడివి కదా సమాధానాలు చెప్ప చూద్దాం. క్విజ్ అన్నమాట... మీ అమ్మ మీకేమవుతుంది?''

''అమ్మ'' అన్నాడు.

''మీ అమ్మ మీ డాడీకి ఏమవుతుంది?''

''భార్య''

''మరి మీ డాడీకి నేనేమవుతాను?''

''భార్యే''


''మరి మీకేమ వుతాను.''

సతీష్ మాట్లాడలేదు. శిరీష నవ్వుతూ ''వెధవకి అర్థం కాలేదు ఆంటీ, అమ్మవి'' అంది.

''తెలిసిందా. నేను మీకు అమ్మని. ఎవరేం చెప్పినా వినకండి. నమ్మకండి. ఆ! మనం కథ చెప్పుకుంటున్నాము కదూ— అప్పుడూ......'' కథ కొనసాగించింది కళ్యాణి.

తరువాతి పది రోజులూ ఆమె కంటిమీదికి కునుకే లేదు. రాత్రింబవళ్ళు పిల్లలతోనే సరిపోయింది. రాత్రిళ్ళు ''అమ్మ'' ''అమ్మ'' అన్న వాళ్ళ కలవరింతలకి బెదిరిపోయిన జనార్దనరావుని వేరే గదిలో పడుకోమంది.

ఒక ఆదివారం ఇద్దరికీ స్నానం చేయించి ''ఈవేళ




రాజ్యాన్ని, ఆమె భర్తనీ మనింటికి భోజనానికి పిలవండి'' అంది.

''ఎందుకు?''

''ఎందుకేమిటి,' పిల్లలు బ్రతికి బయటపడ్డందుకు. పాపం తనకీ వాళ్ళంటే చాలా ప్రేమ కదా!''

''ఆ! జ్వరం రాగానే పంపేశారు భయపడిపోయి. నాకూ భయం వేసింది కళ్యాణి'' అని క్షణం ఆగి ''నిజం కళ్యాణీ, నువ్వు పిల్లలకు చాలా గొప్పగా సేవ చేశావు. వాళ్ళమ్మ బ్రతి కున్నా చేయలేకపోయేదేమో!'' అన్నాడు.

''అలా అనకండి. ఎవరయినా తల్లి తర్వాతే!''

''ఒక్కొక్కసారి అనిపిస్తుంది కళ్యాణీ, దేవుడు ప్రతి పనీ ఏదో అవసరం వుండే చేస్తాడేమోనని! ఇప్పుడు చూడు ఈ అమ్మవారు జ్వరంతో నువ్వు వాళ్ళకి ''అమ్మ''వయి పోయావు. ఇక నిన్ను వదిలి వెళ్ళమన్నా వెళ్ళరు వాళ్ళు!''

కళ్యాణి నవ్వి ''మీ పిల్లల్ని మీకు అప్పచెప్పగలిగాను. రాజ్యం వాళ్ళని పిలవడం మరచిపోకండి!'' అంది.

''సరే, నీ ఆజ్ఞ ప్రకారం వాళ్ళని పిలుస్తాను. నేను మధ్యాహ్నం నుంచి కాంపుకి వెడుతున్నాను.''

భోజనాలు అయిపోయాయి. జనార్దనరావు వెళ్ళిపోయాడు. రాజ్యంతో పిల్లలు వాళ్ళ ''అమ్మ'' వాళ్ళని ఎంత బాగా చూసిందీ వివరించి చెబుతున్నారు.

''నువ్వు 'ఆంటీ' అన్నావు. అది తప్పు ఆంటీ. ఆవిడ అమ్మే!'' వినబడుతున్నాయి గదిలోంచి మాటలు.

కళ్యాణి గబగబ కాగితం, పెన్ను తీసుకుంది. ఆమెకు అన్నగారి దగ్గర నుంచి వుత్తరం వచ్చినప్పటి నుంచి మనసు మనసులో లేదు. అతను—

''కళ్యాణీ, ఏమిటి నువ్వు చేసిన పని? నీ పిల్లల్ని వదిలి కాపరానికి వెళ్ళావు. అందరూ ఆయన్ని ఆదర్శపురుషు డంటారే కాని, పిల్లల్ని కూడా వదిలి వచ్చినందుకు నిన్ను ఆదర్శ మహిళ అనరు. ఏమంటారో కూడా నువ్వు ఊహిం చుకో!

''నీ పిల్లలకి నీ మీద బెంగ. నీకు తెలిస్తే బాధపడతావని అమ్మ వాళ్ళు నీకు వ్రాయడం లేదు. నేను రాస్తున్నాను. పైన నీ ఇష్టం'' అని రాశాడు.

ఆ ఉత్తరం ఆమె ఏ పనిలో వున్నా మనసులో మెదలు తూనే వుంది. చివరికి ఒక నిర్ణయానికి వచ్చేసి రాయసాగింది.

''మీతో అన్నాను ఈ మధ్య— తల్లికీ, పిల్లలకి మధ్య ఎవరూ వుండేందుకు వీల్లేదని! అది నా పట్లకూడా నిజమే. కేవలం శారీరకమయిన కోర్కెలకోసం నా పిల్లల్ని వదిలి నేని క్కడుంటున్నట్లుగా వుంది నాకు. ఆత్మవంచన చేసుకోలేనిక. నా పిల్లల్ని వదిలి వుండలేను.

ఇక్కడా నాకిద్దరు పిల్లలున్నారు. అయితే నా లాంటి తల్లిని వాళ్ళకి మరొకదాన్ని తీసుకురాగలరు మీరు. కాని నా పిల్లలకి తల్లి మరొకతి దొరకదు కదా.

వెడుతున్నాను. సెలవు.

మీది కాలేని

కళ్యాణి''

గబగబ తన బట్టలు పెట్టెలో పెట్టుకుని బయటకు వచ్చేసింది. వెనక్కి తిరిగి ఒక్కసారి ఇంటివంక చూసింది పై గదిలోంచి పిల్లల నవ్వులు వినబడుతున్నాయి. గబగబ నడిచింది.

పుట్టింటికి వస్తూనే తనని చూసి తెల్లబోయిన తల్లి దండ్రుల్ని చూసి ''అదేమిటి అలా వున్నారు. నేను కళ్యాణిని. ఇక కలోగంజో మీరు పెట్టినదే తింటూ ఇక్కడే వుంటాను. ఏరి పిల్లలు?'' అంటూనే ''పద్మ, పవన్'' అంటూ బిగ్గరగా పిలిచింది.

''అదేమిటీ అల్లుడుగారు వచ్చి పిల్లల్ని మీ ఇంటికే తీసుకువెళ్ళారుగా'' అంది తల్లి.

ఈసారి తెల్లపోవడం కళ్యాణి వంతయింది. ''ఏ అల్లుడు గారు?''

''ఇంకెవరు జనార్దనంగారు. మీ ఆయన.''

''అదేమిటి?''

''కూర్చో ముందు. మీ ఆయన వచ్చి పిల్లల్ని తీసుకు వెడతాను, ఇక అందరం కలిసే వుంటాము అంటే మహా నందంగా వెంటనే పంపేశాము ఆయనతో.''

ఒక్క క్షణం అచేతనంగా నిలబడిపోయింది. తరువాత ఆమె కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. ''నిజంగానే ఆయన దేవుడమ్మా, నేను వెళ్ళిపోతున్నాను ఆయన దగ్గరకు'' అంటూనే గభాలున వెనక్కి తిరిగింది.

''అయ్యో అదేమిటి, రేపు వెడుదువుగాని'' అని అరు స్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోతున్న కూతుర్ని చూసి ''మీరు కాస్త బస్టాండు దాకానయినా వెళ్ళి దింపిరండి దాన్ని'' అంది ఆవిడ.

తిరిగి ఇంటికి వచ్చిన కళ్యాణికి ఎదురుగా కనబడిన దృశ్యం నేత్రానందంగా వుంది. నలుగురు పిల్లల్ని కారమ్స్ బోర్డు ఆడిస్తున్నాడు జనార్దనరావు.

''ఏమండి...'' అంది. అంతలో ఆమె గొంతు పూడి పోయింది దుఃఖంతో.

''ఆహా! తెలుసు నాకు నువ్వు వెంటనే వచ్చేస్తావని. వాళ్ళు ఆడుకుంటుంటారు. నువ్వు పైకి పద'' అంటూనే ఆమె నడుం చుట్టూ చెయివేసి నడిపిస్తూ ''నువ్వు నా పిల్లలకి తల్లి వయావు కళ్యాణి. మరి నీ పిల్లలకి నేను తండ్రిని కావక్కర లేదూ? అందుకని తెచ్చేశాను'' అన్నాడు.

గభాలున అతని పాదాల వైపుకి వంగింది కళ్యాణి.

''నో మాడమ్, అది పాత పద్ధతి! ఇదుగో ఇది కొత్త పద్ధతి'' అంటూనే ఆమెని అవలీలగా ఎత్తేసుకుని గదిలోకి తీసుకువెళ్ళిపోయాడు.